అన్ని సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం


హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో గీతా జయంతి వేడుకలు

ఘనంగా గీతా జయంతి వేడుకలు

బంజారాహిల్స్: అన్ని సమస్యలకు భగవద్గీత నుంచి పరిష్కారం లభిస్తుందని హరేకృష్ణ మూమెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్య గౌరచంద్రదాస ప్రభూజీ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో బుధవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరాటంకంగా జరిగిన సంపూర్ణ గీతా పారాయణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భగవద్గీత 700 శ్లోకాలను పఠించారు. సాయంత్రం భగవద్గీతలోని ముఖ్యమైన 108 శ్లోకాల వివరణతో పాటు ప్రత్యేక గీతాలాపన జరిగింది. ఈ సందర్భంగా సత్య గౌరచంద్రదాస ప్రభూజీ మాట్లాడుతూ దాదాపు 5వేల సంవత్సరాల క్రితం శ్రీకృష్ణుడు తన ప్రియ భక్తుడైన అర్జునుడికి గీతా జ్ఞానాన్ని అందించాడని, భగవంతుని, భక్తుల సంతోషం కోసం గీతలోని 18 అధ్యాయాల నుంచి మొత్తం 700 శ్లోకాలను పఠించడం ద్వారా ఈ పవిత్రమైన రోజును జరుపుకుంటామన్నారు. గీతా సందేశం ఒక నిర్దిష్ట మతానికి, కులానికి లేదా దేశానికి పరిమితం కాదని, ఇది సార్వత్రికమైనదన్నారు. భగవద్గీత శాశ్వత సందేశాన్ని చదవడం, ఆచరించడం ద్వారా ఏ వ్యక్తి అయినా జీవితంలో పరిపూర్ణతను సాధించగలడన్నారు. సాయంత్రం గోవిందులకు, శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి జరిగిన మహా హారతితో ఉత్సవాలు ముగిశాయి.

సత్ఫలితాలిస్తున్న 90 రోజుల కార్యాచరణ

- 30 శాతం తగ్గిన సీవరేజీపై ఫిర్యాదులు
- ప్రణాళికలో 720 మెట్రిక్ టన్నుల మట్టి తొలగింపు
- 7061 మ్యాన్‌హోళ్ల క్లీనింగ్
- నెలాఖరులో కార్యాచరణ పూర్తి చేస్తామని అధికారుల వెల్లడి


మ్యాన్‌హోళ్ల నుంచి మట్టి, వ్యర్థాలను తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: సీవరేజీ పైప్‌లైన్ల వ్యర్థాల తొలగింపు, ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం, సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలిస్తోంది. దీంతో డివిజన్–6 పరిధిలో 30 శాతం సీవరేజీ సమస్యలపై ఫిర్యాదులు తగ్గాయి. అక్టోబర్ 2వ తేదీన జలమండలి 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను చేపట్టింది. డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, తట్టిఖానా, ఎస్పీఆర్‌హిల్స్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, ఎస్సార్‌నగర్, ఫతేనగర్, సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడ సెక్షన్ల పరిధిలో ఇప్పటి వరకు 112 కిలోమీటర్ల మేర డీసిల్టింగ్ తొలగించారు. మొత్తం 12 సెక్షన్ల పరిధిలో 750 కిలోమీటర్ల సీవరేజీ పైప్‌లైన్లు ఉండగా ఇందులో 60 రోజుల వ్యవధిలో 112 కిలోమీటర్ల మేర సిల్టింగ్ చేపట్టారు. డివిజన్–6 పరిధిలో 32 వేల సీవరేజీ మ్యాన్‌హోళ్లు ఉండగా ఈ ప్రణాళికలో భాగంగా 7061 మ్యాన్‌హోళ్లను క్లీన్ చేశారు. ఇప్పటి వరకు 720 మెట్రిక్ టన్నుల మట్టిని, వ్యర్థాలను తొలగించి తరలించారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో 220 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 10 మినీ జెట్టింగ్ మిషన్లు, 12 సెక్షన్ కమ్ జెట్టింగ్ మిషన్లు, ఒక హైడ్రాలిక్ సిల్ట్‌గ్రాబర్, 12 సిల్ట్ కార్టింగ్ మిషన్లు పనిచేస్తున్నాయి.

ప్రతిరోజూ సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫిర్యాదులు 500 వరకు వచ్చేవి కాగా, వాటిని 400 వరకు తగ్గించారు. ఈ నెలాఖరు వరకు 100 శాతం డీసిల్టింగ్ తొలగింపు ప్రక్రియ చేపడతామని, అన్ని మ్యాన్‌హోళ్లు క్లీన్ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యాచరణ జనవరి 1వ తేదీ వరకు ఈ అమలుకానుంది.

సిల్ట్ చాంబర్లు నిర్మించుకోవాలి



హోటళ్లు వ్యర్థాలను మ్యాన్‌హోల్‌లోకి వెళ్లకుండా సిల్ట్ చాంబర్లు నిర్మించుకోవాలి. ఇందుకోసం జలమండలి పూర్తిస్థాయిలో ఉచిత సాంకేతికతను సమకూరుస్తుంది. ప్రజలు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతరత్రా వ్యర్థాలను మ్యాన్‌హోళ్లలో వేయకూడదు. ప్రస్తుతం జరుగుతున్న 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 720 మెట్రిక్ టన్నుల మట్టిని, వ్యర్థాలను తొలగించామంటే ప్రజలు ఏ రకంగా మ్యాన్‌హోళ్లలో వాటిని వేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. దీనిని అందరూ అరికట్టాల్సిన అవసరం ఉంది. ఏదైనా సమాచారం కోసం 155313లో సంప్రదించాలి.

–హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్–6

బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కృషి చేయాలి

లిబర్టీ: వెనుకబడిన బీసీ వర్గాలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని బీసీ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల అనుసరిస్తున్న విధానం సరైంది కాదని తెలంగాణ ప్రభుత్వమైన స్పందించి తీర్మానం ప్రవేశపెట్టి బీసీల పక్షాన నిలబడాలని విన్నవించారు. బుధవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు స్పందించి బీసీల జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు తీర్మానం ప్రవేశపెట్టి అన్ని రాజకీయ పార్టీల సహకారంతో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేసీ వేణుగోపాల్‌తో బుర్హానుద్దీన్ భేటీ



బంజారాహిల్స్: రాజ్యసభ సభ్యుడు, పీఏసీ చైర్మన్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో తెలంగాణ కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నేత బుర్హానుద్దీన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాజకీయ పరిస్థితిపై ఈ సందర్భంగా చర్చించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని, సంక్షేమ పథకాలతో అందరి మన్ననలను చూరగొంటున్నదని ఈ సందర్భంగా వేణుగోపాల్ దృష్టికి తీసుకువచ్చారు.

సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు


సమ్మెలో విద్యా శాఖ ఖైరతాబాద్ జోన్ ఆర్పీలు

బంజారాహిల్స్: విద్యా శాఖ సమగ్ర శిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, పేస్కేల్ కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఖైరతాబాద్ జోన్ పరిధిలోని షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల ఉద్యోగులు పాల్గొని న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్లకార్డులు ప్రదర్శించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో జోన్ పరిధిలోని కార్యాలయాల్లో పనులు స్తంభించిపోయాయి. ఖైరతాబాద్–1, ఖైరతాబాద్–2, షేక్‌పేట మండలాల పరిధిలో ఎంఐఎస్, ఐఆర్‌టీ, సీఆర్‌పీ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆయాలు అందరూ కలిసి 13 మంది ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

వడ్డెర కులస్తులను ఎస్టీల్లోకి చేర్చాలని వినతి

ఫిలింనగర్: వడ్డెర కులస్తులను ఎస్టీలో కలపాలని ఫిలింనగర్ 18 బస్తీలకు చెందిన వడ్డెర కులస్తులు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సుమారు 40 మంది నాయకులు ఎమ్మెల్యేను కలిసి తమ కులానికి పూర్తి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో తప్పకుండా ఈ విషయంపై మాట్లాడతానని దానం నాగేందర్ వీరికి హామీనిచ్చారు.

యేసు క్రీస్తు కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్

రహమత్‌నగర్: యేసు క్రీస్తు కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీఆర్‌హిల్స్ జీహెచ్ఎంసీ మైదానంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు జరుపుకునే అతిపెద్ద పండుగ క్రిస్మస్ పండుగ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రైస్తవుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రముఖ వ్యాఖ్యోపదేశకులు పాస్టర్ ప్రవీణ్ కుమార్, సిస్టర్ షారోమ్, పలు చర్చిలకు చెందిన పాస్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బాలాజీ టెంపుల్‌లో పవిత్రోత్సవాలు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన ఆనందవల్లి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భగవద్గీత అవతరించిన వైభవాన్ని ఇక్కడ కనుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు లోకానికి మహోపకారాన్ని అందించిన రోజే కాకుండా అర్జునుడికి గీతోపదేశం చేసిన రోజు కూడా ఇదే కావడంతో ఈ విజయాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను అత్యంత ఆడంబరంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు వెల్లడించారు. భక్తులు, రుత్విక్‌లు, ఆచార్యుల ద్వారా 18 అధ్యాయాల పారాయణం చేపట్టామన్నారు. ఏక కుండాత్మక యజ్ఞాన్ని కూడా వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీకృష్ణుడికి అభిషేకం, అర్చన, మహాప్రసాద నివేదన కూడా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

ఉపేందర్‌రెడ్డికి సన్మానం



శ్రీనగర్‌కాలనీ: అశోక్‌నగర్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కె.ఉపేందర్‌రెడ్డిని ఎర్రగడ్డ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. తొలుత ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు డి.రవిగౌడ్, గంటా మల్లేష్, యాకమ్మ, రాజమణి, కుమారి, ఉమ తదితరులు ఉన్నారు.

టెంపుల్‌కు వచ్చిన యువతికి బెదిరింపు

వ్యక్తిపై కేసునమోదు

బంజారాహిల్స్: టెంపుల్‌కు వచ్చిన ఓ భక్తురాలిపై మద్యం మత్తులో ఉన్న వ్యక్తి దుర్భాషలాడటంతోపాటు బెదిరించడంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మధురానగర్‌కు చెందిన కవిత ఓ టీవీ చానల్‌లో జర్నలిస్ట్‌గా పనిచేస్తుంది. బుధవారం ఆమె శ్రీనగర్‌కాలనీలోని నాగదేవత టెంపుల్‌లో పూజలు నిర్వహిస్తున్న సమయంలో శ్రీనివాస్ మద్యం మత్తులో అక్కడకు వచ్చి కవితపాటు ఇతర భక్తులను నోటి కొచ్చినట్లు తిట్టాడు. రౌడీయిజం చేస్తూ ఇంకోసారి ఇక్కడ కనబడితే అంతుచూస్తానని హెచ్చరించాడు. దీంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురి అరెస్టు.. గంజాయి స్వాధీనం

వెంగళరావునగర్: గంజాయి తాగడానికి ప్రయత్నించిన నలుగురు యువకులను మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ ఎస్ఐ జి.శివశంకర్ మంగళవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో జవహర్‌నగర్ గ్రౌండ్‌లో కొంతమంది ఉన్నట్టుగా గుర్తించి వాహనాన్ని ఆపారు. పోలీసు వాహనాన్ని చూసిన టి.అక్షయ్‌కుమార్, ఎం.హరికృష్ణ, అభినవ్ రాహుల్, విశాల్ బబ్లూ పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించగా గంజాయిని కొనుగోలు చేసి తాగడానికి కూర్చున్నామని తెలిపారు. దీతో వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న 3 గంజాయి పాకెట్లు, 2 ఓసీబీ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంపుకొడుతున్న ఓపెన్ గార్బేజ్‌లు

అన్నపూర్ణ స్టూడియో పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు


అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల పక్కన జవహర్‌నగర్‌లో పేరుకున్న చెత్తకుప్పలు

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ గడ్డ నుంచి జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్‌కు వెళ్లే దారిలో అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల పక్కన జవహర్‌నగర్‌లో ఓపెన్ గార్బేజ్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం అటు స్టూడియోకు, ఇటు సినిమా చాన్స్‌ల కోసం యూనియన్ కార్యాలయానికి, పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారు ఈ చెత్త కుప్పల నుంచి వచ్చే దుర్వాసనలతో ఇబ్బంది పడుతున్నారు. ఓపెన్ గార్బేజ్ పాయింట్లను తొలగించి రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హెచ్చరిస్తున్నా ఎస్ఎఫ్ఏలు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఏఎంఓహెచ్ నిర్వాకం, ఎస్ఎఫ్ఏల నిర్లక్ష్యంతో సర్కిల్ పరిధిలోని చాలా చోట్ల ఓపెన్ గార్బేజ్ పాయింట్లు స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. రోజూ రోడ్లను ఊడ్చడంలో, చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రోడ్ల పక్కన ఉన్న చెత్తకుప్పలను తొలగించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

'ఈఎస్ఐసీ'కి నాలుగు పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ– ఆదర్శనగర్)కు అంతర్జాతీయ వేదికల్లో గుర్తింపు పొందినట్లు తిరుపతి ఉప ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ డి.రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ యూనియన్ ఆధ్వర్యంలో 'సామాజిక భద్రత ప్రయోజనాల సేవలపై' సదస్సు జరిగింది. ఈ సదస్సులో తిరుపతి ప్రాంతీయ ఈఎస్ఐసీ వివిధ సామాజిక భద్రతలకు సంబంధించి అందించిన సేవలను గుర్తించారు. వర్క్ ప్లేస్ ప్రమాదాలు, అనారోగ్యం, స్థిరమైన పెట్టుబడి, సిస్టమ్ ఫ్లెక్సిబిలిటీకి సంబంధించి నాలుగు ఎక్సలెన్స్ అవార్డులు దక్కా యి. ఈసీఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ కార్పొరేషన్ తరఫున పురస్కారాలు అందుకున్నారు.

ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి

యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డ యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని ఓ బస్తీలో నివాసం ఉంటున్న బాలిక (15) ఓ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆమె నివాసం ఉంటున్న ఇంటి యజమాని కొడుకు హబీబ్ (24) బాలికను ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె గదిలోకి వచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన బాలిక తండ్రి ఈ విషయంపై హబీబ్ కుటుంబ సభ్యులను నిలదీయగా తమకేమీ సంబంధం లేదని చేతులు దులుపుకున్నారు. హబీబ్‌ను పిలిపించి గట్టిగా ప్రశ్నించగా తాను బాలికను ఏమి చేయలేదని, ఆమెను సోదరిలా చూస్తున్నానని బుకాయించాడు. కాగా ఏడాది నుంచి తనపై పలుమార్లు లైంగిక దాడి చేశాడని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బుధవారం బాలిక తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, హబీబ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మధురానగర్ పీఎస్ పరిధిలో ..

వెంగళరావునగర్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైన సంఘటన పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో నివసించే కుటుంబానికి చెందిన యువతికి 2024 ఆగస్టులో సయీన్ ముజాసల్ అలీ అనే క్యాబ్ డ్రైవర్‌తో పరిచయం అయింది. ఈ క్రమంలో యువతి ప్రేమిస్తున్నానని ముజాసల్ అలీ వెంటపడ్డాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో చనిపోతానని బెదిరించడంతో ఆమె ఒప్పుకుంది. త్వరలోనే ఇంట్లో వారి అంగీకారంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ ఇంటిని కిరాయికి తీసుకొని ఆమెతో ఉన్నాడు. ఒకరోజు రూ.80 వేలు అత్యవసరమని చెప్పి ఆమె నుంచి తీసుకున్నాడు. కొన్ని నెలల తర్వాత ముఖం చాటేశాడు. యువతి ముజాసల్ ఆలీని నిలదీయగా తన తల్లి ఒప్పుకోలేదని, ఆమెను పెళ్లి చేసుకోవడం కుదరదని తేల్చి చెప్పాడు. దీంతో ప్రేమ పేరుతో మోసం చేసిన ముజాసల్ ఆలీపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత వస్త్రాలు ధరించి ప్రోత్సహిద్దాం


చీరలను పరిశీలిస్తున్న సత్యవతి రాథోడ్

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ చేనేత కళాకారుల్లో విశేష ప్రతిభ ఉన్నదని, చేనేత వస్త్రాలను ధరించి వారికి ప్రోత్సాహాన్ని అందిద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనలో వస్త్రాలను తిలకించి చేనేతకారులను అభినందించారు. తామంతా చేనేత వస్త్రాలతో ధరిస్తామని, ఇక్కడి చీరలు చాలా నాణ్యతతో పాటు అరుదైన చీరలున్నాయన్నారు. దేశంలో ప్రముఖ ప్రాంతాల చేనేత వస్త్రాలను ఒకచోట చేర్చి నేరుగా వినియోగదారులకు అందించడం శుభపరిణామన్నారు. మన బాధ్యతగా చేనేత వస్త్రాలను ధరించాలని కోరారు. శుభకార్యాలు, పండుగలకు ముఖ్యంగా సంక్రాంతి పండుగకు విభిన్న, కొంగొత్త రంగుంగుల చేనేత వస్త్రాలైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలు సుమారు 80 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచామని, ఈనెల 15వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు తెలిపారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలి

లిబర్టీ: సంప్రదాయ వృత్తిని నమ్ముకొని బతుకు బండిలాగుతున్న ముదిరాజ్‌లకు తెలంగాణ ప్రభుత్వం చేయూతనివ్వాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా చితికిపోయి వృత్తిని జీవన భృతిగా మలుచుకొని దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్నారని ఆయన అన్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులవృత్తులు క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవ తీసుకొని ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. తరతరాలుగా ముదిరాజులు శ్రమనే నమ్ముకొని జీవన పోరాటం చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతం వరకు ముదిరాజులు అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ప్రజాహిత కార్యక్రమాల్లో ముదిరాజులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర జనాభాలో ముదిరాజులు అత్యధిక శాతం ఉన్నారని యాదగిరి ముదిరాజ్ గుర్తు చేశారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లో నివసించే మాధవ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. అతని కుమార్తె శ్రీనగర్ కాలనీలో బొటిక్‌లో సేల్స్‌గర్ల్‌గా విధులు నిర్వహిస్తుంది. మంగళవారం ఉదయం తన కుమార్తెను ఆమె పని చేసే చోట డ్రాప్ చేసి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఫోన్ చేయగా యువతి లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె ఓనర్‌కు ఫోన్ చేయగా సెలవు పెట్టినట్టుగా చెప్పింది. మళ్లీ కుమార్తెకు ఫోన్ చేయగా బొటిక్‌లోనే ఉన్నానని తెలిపింది, తండ్రి ఇంటికి రావాలని ఆమెతో చెప్పగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. రెండు రోజులైనా కుమార్తె ఇంటికి రాకపోవడంతో యువతి తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను దత్తత తల్లిదండ్రులకు అప్పగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ విప్లవ్

కాచిగూడ: చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధీనంలో ఉన్న 9మంది పిల్లలను వారి దత్తత తల్లిదండ్రులకు అప్పగించాలని తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ విప్లవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అక్షర జ్యోతి ఉమెన్ అండ్ చైల్డ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు జి.అనూష, స్టూడెంట్ యూనియన్ నేతలు మధు కొండేటి, శిలతో కలిసి ఆయన మాట్లాడుతూ మే 22వ తేదీన జరిగిన పిల్లల అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహించే సంధ్యారాణి అనే మహిళ 47 మంది పిల్లలను ఇతరులకు అప్పగించినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ వెల్లడించారని తెలిపారు. ఈ సంఘటనలో 16 మంది పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారని, వారిలో 9 మంది పిల్లలను తీసుకున్న దత్తత తల్లిదండ్రులు ఉన్నారని తెలిపారు. పిల్లలను తీసుకున్న దత్తత తల్లిదండ్రులు తమ పిల్లలను తమకు అప్పగించాలని హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత తీసుకున్న వ్యక్తులకు పిల్లలను పెంచుకునే అన్ని విధాలుగా అర్హతలుంటే విచారణ చేపట్టి అప్పగించాలని హైకోర్టు చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్‌కు సూచించడం జరిగిందన్నారు. అయినా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు పిల్లలను అప్పగించకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా విచారణ చేపట్టి అర్హతలున్న దత్తత తల్లిదండ్రులకు పిల్లలను అప్పగించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీవరేజీ పనులు ప్రారంభం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ మారుతీనగర్‌లో సీవరేజీ పనులకు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన చేశారు. రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులను వాటర్‌వర్క్స్ జీఎం షరీఫ్, మేనేజర్ నదీంలతో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. మారుతీనగర్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు కృష్ణయాదవ్, షరీఫ్, మహేందర్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, ప్రసాద్ రమేష్‌లు పాల్గొన్నారు.